క్లుప్తంగా

మానవాళికి సత్యం ధర్మాన్ని బోధించాలి



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై మూడు రోజులపాటు జరగనున్న 'సంక్షిప్త రామాయణం' ధారావాహిక ప్రవచనం సోమవారం రాత్రి ప్రారంభమైంది. ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకులు కేవీ కోటేశ్వరరావు ప్రసంగిస్తూ మానవ జీవితం అత్యంత పవిత్రమైనదని అన్నారు. మనం కోరుకుంటే మానవ జీవితం లభించదని, దాన్ని గొప్పగా వినియోగించుకోవడంలో సార్ధకత ఉందని చెప్పారు. ధర్మం, దైవం కోసం కొంతైనా సమయం కేటాయించలేకపోతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, మన్నవ రవిప్రసాద్, పి.శివారెడ్డి, సాంబశివరావు, మురికిపూడి లక్ష్మీసత్యనారాయణ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో చండీహోమం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో సోమవారం మాస శివరాత్రి సందర్భంగా గణపతి, చండీహోమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో జరగ్గా, బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులతో తొమ్మిది మంది వేదపండితులు గణపతికి, శివలింగానికి, నవగ్రహాలకు విశేష అభిషేకాలు, అర్చనలు, లక్ష్మీ గణపతి, చండీ, రుద్ర హోమాలు నిర్వహించి పూర్ణాహుతి చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు సీహెచ్.మస్తానయ్య, కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

232 మంది హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో సోమవారం హజ్ యాత్రకు వెళ్లే 232 మందికి ప్రత్యేక వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి ప్రారంభించి మాట్లాడారు. వ్యాక్సిన్ చేయించుకోవడం ద్వారా పోలియో, మెదడు వాపు, ఫ్లూ ఇతర వ్యాధులు రాకుండా ఉంటాయన్నారు. హజ్ యాత్రకు వెళ్లేవారికి మందులు ఉచితంగా అందజేశామన్నారు. కార్యక్రమంలో ఇమ్యూనైజేషన్ అధికారులు డాక్టర్ కె.వి.సుబ్బరాజు, డాక్టర్ టి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పెమ్మసాని ఒక వలస పక్షి

ఇండియా కూటమి అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్

లక్ష్మీపురం: గుంటూరు పార్లమెంట్‌కు టీడీపీ కూటమి తరపున పోటీ చేస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్ వలస పక్షితో సమానమని ఇండియా కూటమి గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్ విమర్శించారు. స్థానిక కొత్తపేటలోని గుంటూరు మల్లయ్య లింగం భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టీడీపీ కూటమిని ఓడించాలని పిలుపునిచ్చారు. గుంటూరు పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఇండియా కూటమి అభ్యర్థినైనా తనకు కంకి కొడవలి గుర్తు పై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, జిల్లా నాయకులు మేడా హనుమంతరావు, అరుణ్‌కుమార్, కాబోతు ఈశ్వరరావు, జంగాల చైతన్య పాల్గొన్నారు.

మంచినీళ్లు అడిగి..వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీ

చేబ్రోలు: మధ్యాహ్నం సమయంలో దప్పికవుతుందని, తాగునీరు కావాలని అడిగిన ఇద్దరు యువకులు.. మంచినీరు ఇచ్చిన వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు ఎత్తుకెళ్లిన ఘటన మండలంలోని కొత్తరెడ్డిపాలెంలో సోమవారం చోటుచేసుకుంది. కొత్తరెడ్డిపాలెంలో గాదె సీతారామమ్మ అనే వృద్ధురాలు ఉంటోంది. ఆమె కుమారుడు వ్యాపార రీత్యా గుంటూరులో ఉంటున్నారు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన సుమారు 25ఏళ్ల వయస్సు కలిగిన ఇద్దరు యువకులు.. సీతారావమ్మను మంచి నీరు కావాలని అడిగారు. ఆమె ఇంటిలోకి వెళ్లి నీరు తెచ్చి ఇచ్చింది. ఆమె వెనుతిరిగిన వెంటనే మెడలో ఉన్న సుమారు రూ.1.50లక్షలు విలువ చేసే రెండు వరుసల బంగారు గొలుసును లాక్కొని పారిపోయారు. ఈ ఘటనను కుమారుడు గాదె వెంకట శివరామకృష్ణారెడ్డికి తెలియజేయటంతో.. పరిసర ప్రాంతాల్లో విచారించిన అనంతరం అతను పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ పి.మహేష్ కుమార్ కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు.

ఓటమి భయంతోనే దుష్ప్రచారాలు

- ఎన్నికల సమయంలో కావాలని విషం చిమ్ముతున్న టీడీపీ, ఎల్లో మీడియా
- లాండ్ టైట్లింగ్ చట్టం ఎంతో మంచిదని గతంలో ఈటీవీలో కథనం
- చట్టం అద్భుతమంటూ అసెంబ్లీలో పొగిడిన టీడీపీ నేత పయ్యావుల కేశవ్
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- గుంటూరు 21వ డివిజన్ మనతో మన రజినమ్మ కార్యక్రమం
- హాజరైన శాసనమండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి



ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి విడదల రజిని, విప్ లేళ్ల అప్పిరెడ్డి

పట్నంబజారు: ఎన్నికల్లో ఓటమి భయంతోనే టీడీపీ లాండ్ టైట్లింగ్ చట్టంపై దుష్ప్రచారాలు చేస్తోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖమంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని పేర్కొన్నారు. గుంటూరు 21వ డివిజన్‌లో సోమవారం మనతో మన రజినమ్మ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లాండ్ టైట్లింగ్ యాక్ట్ ఎంతో మంచి చట్టమని, ఈ చట్టం వస్తే భూ కబ్జాలకు తెర పడుతుందని, ఆ పార్టీ నాయకుడు పయ్యావుల కేశవ్ అసెంబ్లీ సాక్షిగా సమర్థిస్తూ మాట్లాడారన్నారు. చంద్రబాబు సొంతమీడియా ఈ టీవీలో కూడా ఈ చట్టం అద్భుతమని, ఈ చట్టం వస్తే రైతుల భూములకు భద్రత ఉంటుందని కథనం ప్రసారం చేశారని తెలిపారు. ఇప్పుడు ఎన్నికల సమయంలో టీడీపీ ఆ చట్టంపై దుష్ప్రచారం చేస్తూ, ఓటర్లను భయాందోళనలకు గురి చేస్తోందని పేర్కొన్నారు. ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై దుష్ప్రచారం చేస్తున్నందుకు ఎన్నికల కమిషన్ కూడా చంద్రబాబు, లోకేష్‌లపై కేసులు నమోదు చేసిందని తెలిపారు. ఈ చట్టాన్ని ప్రతిపాదించింది కేంద్ర ప్రభుత్వమని, చంద్రబాబుకు దమ్ముంటే ఈ చట్టం మంచిది కాదని మోదీ ముందు చెప్పాలని డిమాండ్ చేశారు. జగన్‌పై పచ్చ మీడియా ఎంత విషం చిమ్మినా, జనం గుండెల్లో నుంచి జగన్‌ను ఎవరూ తీసివేయలేరని వెల్లడించారు. వచ్చే సోమవారం నిర్వహించనున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అఖండ విజయం సాధించడం ఖాయమన్నారు.

పశ్చిమలో వైఎస్సార్‌సీపీ జెండా పాతుదాం

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురేయటం ఖాయమని శాసనమండలి విప్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి తెలిపారు. ప్రజలంతా వైఎస్సార్ సీపీకి ఓటు వేసి గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. జగనన్న సంక్షేమ పథకాల ద్వారా ప్రజలంతా ఆనందంగా ఉన్నారని చెప్పారు. చంద్రబాబునాయుడు మాయ మాటలను ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మరని పేర్కొన్నారు. తొలుత మంత్రి రజిని 21వ డివిజన్‌లో కొండా వెంకటప్పయ్య కాలనీ 1వ లైను, 3వ లైను, యతిరాజు నగర్, వికలాంగుల కాలనీ, భాను ప్రసాద్ కాలనీ, బోయల కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చల్లా వెంకటకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు కడప రత్నాకర్, కార్పొరేటర్ కాండ్రుకుంట గురవయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు అంగడి శ్రీనివాసరావు, చంద్రగిరి ధీరజ్, కొమ్మారెడ్డి నాగేశ్వరరావు, తిరుమలేశ్వరరావు, రాంబాబు, రవీంద్రనాయక్, విజయ్, గేరా రవి పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌కు అండగా నిలవాలి

ఎమ్మెల్యే గిరిధర్



ప్రచారంలో భాగంగా సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే గిరి

పట్నంబజారు: రాష్ట్రంలో మరో వారం రోజుల్లో జరుగనున్న ఎన్నికలు ఎంతో కీలకమని, పేదలకు పెత్తందారుల మధ్య జరిగే పోరాటంలో పేదల పక్షపాతి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పక్షాన ప్రతి ఒక్కరూ నిలబడాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ గుంటూరు నగర అధ్యక్షుడు మద్దాళి గిరిధర్ పిలుపునిచ్చారు. ఈమేరకు సోమవారం 33వ డివిజన్ పండరీ పురం, దేవాపురం ప్రాంతాల్లో గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి రోశయ్య, పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి, మంత్రి విడదల రజినికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గిరిధర్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా మార్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందన్నారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ గోపిశ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నేతలు, డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

తలసీమియాపై అవగాహన కలిగి ఉండాలి

డాక్టర్ మంచికంటి అనూరాధ



గుంటూరు మెడికల్: భారతదేశంలో నాలుగు శాతం మంది జన్యుపరమైన కారణాలతో తలసీమియా వ్యాధి బారిన పడుతున్నారని సొసైటీ ఆఫ్ ఫీటల్ మెడిసిన్ సెక్రటరీ, గుంటూరు వేదాంత హాస్పిటల్ సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ మంచికంటి అనూరాధ చెప్పారు. స్థానిక మంగళగిరి రోడ్డులోని వేదాంత హాస్పిటల్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తల్లిదండ్రులు ఇరువురిలో తలసీమియా కేరియర్స్‌గా ఉంటే 25 శాతం పుట్టే పిల్లలు తలసీమియా వ్యాధితో పుడతారని చెప్పారు. ప్రతి ఏడాది పదివేల మంది చిన్నారులు మేజర్ తలసీమియాతో జన్మిస్తున్నారని, వీరికి సకాలంలో రక్తం ఎక్కించడానికి అందుబాటులో దొరక్క ఇబ్బందులు పడుతున్నట్లు వెల్లడించారు. ఫీటల్ మెడిసిన్ ద్వారా గర్భంలోనే తలసీమియా సోకుతుందా లేదా అనే విషయాన్ని గుర్తించి నివారించవచ్చు అన్నారు. మే 8న వరల్డ్ తలసీమియా డే నిర్వహిస్తున్నారని, ప్రతి ఒక్కరూ తలసీమియా వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి గర్భిణికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించడం ద్వారా తలసీమియాను కట్టడి చేయవచ్చు అన్నారు. ఫీటల్ మెడిసిన్ సొసైటీ ఏపీ అధ్యక్షురాలు డాక్టర్ కె.వి. శ్రీదేవి సహకారంతో తలసీమియాపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు.

దివీస్ ల్యాబ్ క్యాంపస్ ఇంటర్వ్యూలు



విద్యార్థులతో జూపూడి రంగరాజు, మధుసూదనరావు, నాగభూషణం తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో సోమవారం హైదరాబాద్‌కు చెందిన దివీస్ లేబొరేటరీస్ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. ఈ సందర్భంగా వివిధ కళాశాలల్లో బీ ఫార్మసీ చివరి సంవత్సరం చదువుతున్న 70 మంది విద్యార్థులు హాజరు కాగా, వారికి వివిధ దశల్లో ఎంపికలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం తెలిపారు. రాత పరీక్ష, మౌఖిక ఇంటర్వ్యూల ద్వారా విద్యార్థులను ఎంపిక చేసిన దివీస్ ల్యాబ్స్ ప్రతినిధులు వారికి త్వరలో ఉద్యోగ నియామక పత్రాలు పంపున్నట్లు పేర్కొన్నారు. ఈసందర్భంగా ఉద్యోగాలకు ఎంపికైన హిందూ ఫార్మసీ కళాశాల విద్యార్థులను కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదనరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవికుమార్, ప్లేస్‌మెంట్ సెల్ కో-ఆర్డినేటర్ డి.బ్రహ్మ శ్రీనివాసరావు, ఓఎస్డీ డాక్టర్ పి.సీ తారామయ్య అభినందించారు.

వికారాబాద్ ఎక్స్‌ప్రెస్‌లో గుర్తు తెలియని మృతదేహం



లక్ష్మీపురం: గుంటూరు రైల్వే స్టేషన్ వికారాబాద్ ఎక్స్‌ప్రెస్(రేపల్లె -వికారాబాద్) జనరల్ బోగీలో సుమారు 40 సంవత్సరాల వయసు కలిగిన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం అయిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. రైల్వే జీఆర్పీ ఎస్ఐ వెంకటాద్రి తెలిపిన వివరాలు.. రేపల్లె- వికారాబాద్ జనరల్ బోగీలో 40 సంవత్సరాల వయస్సు ఉన్న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతుడి వివరాలు తెలిసిన వారు జీఆర్పీ ఎస్ఐ నంబర్‌కు సమాచారం తెలియజేయాల్సిందిగా తెలిపారు.

ఏసీబీ డీఎస్పీ బదిలీ

నగరంపాలెం: గుంటూరు ఏసీబీ డీఎస్పీ టీవీవీ ప్రతాప్‌కుమార్ బదిలీయ్యారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం ఆయన్ను అనంతపురం జిల్లా అర్బన్ డీఎస్పీగా బదిలీ చేశారు. సుమారు 4 ఏళ్ల పాటు ఆయన ఏసీబీలో సమర్థంగా విధులు నిర్వహించారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

పట్నంబజారు: వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భర్తను హతమార్చేందుకు సహకరించిన భార్య, హతమార్చిన ఆమె ప్రియుడు, మరో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాలు.. ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం, ఆర్.ఉమ్మడివరం గ్రామానికి చెందిన కుక్కమూడి ప్రేమ్‌కుమార్(35) తన భార్య, పిల్లలతో బతుకు తెరువు నిమిత్తం గుంటూరు వచ్చి బుచ్చయ్యతోటలో నివాసం ఉంటూ మార్కెట్‌లో పండ్ల వ్యాపారం చేస్తున్నాడు. అతడి భార్య భారతీ లాలాపేట పూల మార్కెట్ సెంటర్‌లో సమోసాలు తయారు చేసే షాపులో పనికి వెళుతుంటోంది. ఈక్రమంలో షాపు యజమాని షేక్ గౌస్‌తో అక్రమ సంబంధం పెట్టుకున్న క్రమంలో విషయం తెలిసిన ప్రేమ్‌కుమార్ తన భార్యను వారించాడు. ఈక్రమంలో ఇద్దరి మధ్య వివాదాలు జరుగుతున్న నేపథ్యంలో భర్తను హతమార్చేందుకు భారతీ పక్కా పథకం రచించింది. అప్పటికే పరిచయం ఉన్న గౌస్ గతనెల 28వ తేదీ రాత్రి ప్రేమ్‌కుమార్‌ను మద్యం తాగుదామని మాయమాటలు చెప్పి గౌస్‌తోపాటు తన తమ్ముడు ఖాశిం, అతని స్నేహితుడు రహమాన్ పథకం ప్రకారం ప్రేమ్‌కుమార్‌ను వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడు పరిధిలోని ఖాళీ స్థలాల్లోకి తీసుకెళ్లారు. మద్యం తాగించి కర్రతో కొట్టి వెంట తెచ్చుకున్న కత్తులతో ప్రేమ్‌కుమార్ గొంతు కోసి హతమార్చారు. అనంతరం ప్రేమ్‌కుమార్ భార్య భారతీ తనకు ఏమీ తెలియనట్లు గతనెల 29వ తేదీన తన భర్త పెళ్లికి వెళ్లి వస్తానని చెప్పి తిరిగి రాలేదని, కనిపించకుండా పోయినట్లు ఫిర్యాదు చేసింది. దీనిపై దర్యాప్తు చేపట్టిన ట్రాఫిక్ డీఎస్పీ వి.వి.నాయుడు, కొత్తపేట పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ షేక్ అన్వర్‌బాషా, సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా భారతీ ప్రియుడు గౌస్‌తో కలిసి భర్తను హతమార్చినట్లు గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా, నిందితులు నేరాన్ని అంగీకరించారు. ఈ మేరకు వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి



చికిత్స పొంది ఇంటికి వచ్చిన రాజేష్‌బాబును పరామర్శిస్తున్న రవిరాజా, నాహిద్, రాజు

గుంటూరు ఈస్ట్: వైఎస్సార్ సీపీ కార్యకర్తపై కాంగ్రెస్‌పార్టీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలి సోమవారం దాడిచేశాడు. బాధితుడు చీదర్ల రాజేష్‌బాబు తెలిపిన వివరాలు.. శారదా కాలనీ 19వ లైనులో చీదర్ల రాజేష్‌బాబు, మహబూబ్, సాల్మాన్, చిన్నబ్రహ్మయ్య పార్టీ కరపత్రాలు పంపిణీ చేస్తూ గడప గడపకు వెళ్లి నూరిఫాతిమాను గెలిపించాలని ప్రచారం చేస్తున్నారు. అదే సమయంలో తమ అనుచరులతో అటువైపు వచ్చిన షేక్ మస్తాన్‌వలి, రాజేష్‌బాబును పిలిచి వైఎస్సార్ సీపీకి ఎందుకు ప్రచారం చేస్తున్నావంటూ ప్రశ్నించాడు. రాజేష్‌బాబు తగిన సమాధానం చెప్పాడు. అయితే మస్తాన్‌వలి రాజేష్‌బాబును దుర్భాషలాడాడు. కులం పేరుతో దూషించి దాడి చేశాడు. మస్తాన్‌వలి రాజేష్‌ను దూషించడంతోపాటు, తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫాను దుర్భాషలాడాడు. గాయాలపాలైన రాజేష్‌బాబు జీజీహెచ్‌లో చికిత్స పొందిన అనంతరం అరండల్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వైఎస్సార్‌సీపీ నగర ఎస్సీ సెల్ నాయకుడు మల్లవరపు రవిరాజా, నాయకులు నాహిద్, అగ్గిపెట్టె రాజు, రఫీ, కిరణ్‌లు జీజీహెచ్‌కు వచ్చి రాజేష్‌బాబును పరామర్శించారు.

కొనసాగుతున్న పోస్టల్ బ్యాలెట్ పోలింగ్



పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకుంటున్న ఉద్యోగులు

నెహ్రూ నగర్: పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు గుంటూరు తూర్పు నియోజకవర్గానికి ఏసీ కాలేజిలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటర్లకు తగిన సమాచారం అందించేందుకు ప్రత్యేక హెల్ప్ డెస్క్, సిబ్బందిని ఏర్పాటు చేయడం జరిగిందని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి తెలిపారు. సోమవారం స్థానిక ఏసీ కాలేజిలోని ఫెసిలిటేషన్ సెంటర్ ని పరిశీలించి, పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌లో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కుని వినియోగించుకోవడానికి అనువుగా ఏసీ కాలేజి ఫెసిలిటేషన్ సెంటర్‌లో ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్‌కి దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులు ముందుగా హెల్ప్ డెస్క్‌లో తమ ఓటు వివరాలు తెలుసుకొని, ఓటింగ్ కోసం వివిధ నియోజకవర్గాలకు వేర్వేరుగా ఏర్పాటు చేసిన 6 ప్రత్యేక కౌంటర్లలో ఓటు వినియోగించుకోవచ్చని తెలిపారు. మంగళవారం ఓపీఓలు, బుధవారం పోలీసులు, ఎన్నికల విధులు కేటాయించబడిన ఇతర సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్‌కి ఏర్పాట్లు చేశామని తెలిపారు.

392 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు

నెహ్రూ నగర్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ఐదో తేదీ నుంచి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఎలక్షన్ కమిషన్ కల్పించిన విషయం తెలిసిందే. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో రెండో రోజైన సోమవారం 392 పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఉద్యోగులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొదటి రోజైన ఆదివారం నాడు 368 ఓట్లు పోలవ్వగా రెండు రోజులు కలిపి 760 ఓట్లు పోలయ్యాయి.

మాదిగల మద్దతు వైఎస్సార్ సీపీకే

మాదిగ మహాసేన రాష్ట్ర అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్



వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలియజేస్తూ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రేమ్‌కుమార్

నెహ్రూనగర్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మాదిగలకు అన్ని విధాలుగా మేలు జరిగిందని, మళ్లీ ముఖ్యమంత్రి అయితే మాదిగలకు మరింత లబ్ధి చేకూరుతుందని మాదిగ మహాసేన రాష్ట్ర అధ్యక్షులు కొరిటిపాటి ప్రేమ్‌కుమార్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్త పర్యటనలో భాగంగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని మాదిగలతో నగరంపాలెంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ద్వారా మాదిగలు ఆర్థికంగా నిలదొక్కుగలిగారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గంలో ఉన్న మాదిగలంతా వైఎస్సార్ సీపీ తరపున నిలబడిన మంత్రి విడదల రజిని అఖండ మెజార్టీతో గెలిపించి టీడీపీ కంచు కోటను బద్దలు కొట్టాలన్నారు. భవిష్యత్‌లో పశ్చిమ నియోజకవర్గం అంటే వైఎస్సార్ సీపీ గడ్డా అని చెప్పుకునే విధంగా రజినిని గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు దాసరిపల్లె విక్టర్, కొదమల వినయ్‌కుమార్, దర్శనపు ప్రసాద్, గుడ్డేటి జోషి, కోటేశ్వరరావు, దేవరకొండ శివ, బాబు, రెబ్బవరపు మనోహర్, నూతక్కి బాబు, జయరాం, నాగిపోగు రాజేష్, బుట్టి సురేష్, బాబూరావు, మోహనరావు పాల్గొన్నారు.

నాట్కోలో వారంలో నాలుగు రోజులు ఆపరేషన్లు



మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రి నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో సర్జికల్ అంకాలజి విభాగంలో వారంలో నాలుగు రోజులు ఆపరేషన్లు, రెండు రోజులు ఓపీ ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ చెప్పారు. సోమవారం ఆసుపత్రి నాట్కో సెంటర్‌లో పలు విభాగాధిపతులతో సమీక్ష చేశారు. డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ అన్ని ఓపీల మాదిరిగానే నాట్కో సెంటర్‌లో కూడా ఓపీ ఉదయం 9 గంటలకు ప్రారంభం కావాలన్నారు. మధ్యాహ్నం కూడా ఓపీ నిర్వహించాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. ప్రతి సోమ, గురువారం మెడికల్ అంకాలజి విభాగంలో కొత్త ఓపీ రిజిస్ట్రేషన్ లు జరగాలని చెప్పారు. మంగళ, శుక్ర వారాల్లో రేడియేషన్ అంకాలజిలో రిజిస్ట్రేషన్లు, బుధ, శని వారం సర్జికల్ అంకాలజి రిజిస్ట్రేషన్లు జరగాలని తెలిపారు. మూడు వైద్య విభాగాలు సమన్వయంతో పని చేయాలనీ, ఒకరి ఎక్కువ మరొకరు తక్కువ అనే భావన రాకూడదన్నారు. 15 రోజులుగా సర్జికల్ విభాగంలో డీఈఓ రావడం లేదని అంకాలజి వైద్యులు వెంకటరెడ్డి, సూపరింటెండెంట్ దృష్టికి తీసుకుని రాగానే వెంటనే నోటీసు ఇచ్చి వేరే ఒకరిని నియమించాలని ఆదేశించారు. ఆరోగ్య మిత్రలు కూడా సక్రమంగా విధులకు హాజరు కావాలని లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జీజీహెచ్‌లో షార్ట్ సర్క్యూట్

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రిలో సోమవారం ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించి ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్న గోపి గాయపడ్డాడు. గాయపడి క్యాజువాల్టీలో చికిత్స పొందుతున్న బాధితుడిని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ పరామర్శించారు. పేషంట్ కు అత్యవసర చికిత్సతో పాటు ప్రత్యేక వార్డును కేటాయించాల్సిందిగా ఆదేశించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మరొకరికి ఎలాంటి ప్రమాదం జరగకూడదనే ఉద్దేశంతో ప్రత్యేక టూల్ కిట్ ను కొనుగోలు చేసి ఎలక్ట్రీషన్‌లకు అందజేశామన్నారు. విధుల్లో సిబ్బంది తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

పోలింగ్ రోజు సమన్వయంతో విధులు నిర్వహించాలి

నెహ్రూనగర్: ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పాటిస్తూ పోలింగ్ రోజు సమన్వయంతో విధులు నిర్వహించాలని గుంటూరు నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి(ఆర్ఓ) కీర్తి చేకూరి తెలిపారు. ఏసీ కాలేజ్‌లో రెండో రోజు నిర్వహిస్తున్న తూర్పు నియోజకవర్గ పీఓలు, ఏపీఓలు, మైక్రో అబ్జర్వర్లకు శిక్షణను సోమవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల విధులను వివిధ బృందాలు సమన్వయంతో చేపడితే పోలింగ్ విజయవంతంగా జరుగుతుందని చెప్పారు. మాక్ పోలింగ్ చేపట్టాలని, మాక్ పోలింగ్‌లో అభ్యర్థుల ఏజెంట్లు ఉండేలా చూడాలన్నారు. ఈవీఎం కవర్లు, పరిశీలన కవర్లు అందులో ఫైల్ చేయాల్సిన డాక్యుమెంట్లు తదితర అంశాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. శిక్షణలో భాగంగా డెమో ఈవీఎంల కమిషనింగ్ చేయిస్తారని, పోలింగ్ రోజు ఏ సమస్య వచ్చినా తక్షణం ఉన్నతాధికారులు దృష్టికి తీసుకురావాలని కోరారు.

బ్లేడ్‌తో దాడి, దోపిడీ

తెనాలి రూరల్: రోడ్డు వెంబడి ఫుట్‌పాత్‌లపై నిద్రిస్తున్న వారిని బ్లేడుతో దాడి చేసి గాయపరిచి వారి వద్ద ఉన్న నగదును దోచుకెళ్లిన ఘటన ఆదివారం అర్ధరాత్రి తెనాలిలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు... తెనాలి రైల్వే స్టేషన్ నుంచి బస్టాండ్‌కు వెళ్లే మార్గంలో వంతెన ఫుట్‌పాత్‌పై కొందరు నిద్రిస్తున్నారు. నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి నిద్రిస్తున వారి జేబులు వెతుకుతుండగా అప్పుడే భోజనం చేస్తున్న పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం నారాయణపురం గ్రామానికి చెందిన గురజాల కోటిబాబు(క్యాటరింగ్ పనులకు వెళుతుంటాడు) ఎందుకు వెతుకుతున్నారని ప్రశ్నించాడు. దీంతో అతడి వద్దకు వచ్చిన నలుగురు యువకులు బ్లేడుతో అతడిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచి, అతడి వద్ద ఉన్న రూ.1,800, సెల్‌ఫోను లాక్కువెళ్లారు. బాధితుడు త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా అతడిని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు పంపారు. పోలీసులు విచారిస్తున్నారు.

సేద్యపు నీటి కుంటలతో రైతులకు మేలు

ఈజీఎస్ జాయింట్ కమిషనర్ మల్లెల శివప్రసాద్

కొత్తమల్లాయపాలెం(ప్రత్తిపాడు): సేద్యపు నీటి కుంటలతో రైతులకు మేలు చేకూరుతుందని ఈజీఎస్(ఎంప్లాయిమెంట్ గ్యారంటీ స్కీమ్) జాయింట్ కమిషనర్ శివప్రసాద్ అన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ప్రత్తిపాడు మండలం కొత్తమల్లాయపాలెంలో తీసిన సేద్యపు నీటి కుంటలను సోమవారం ఈజీఎస్ జాయింట్ కమిషనర్ శివప్రసాద్ పరిశీలించారు. ఎన్ని ఎకరాలకు, ఎంత విస్తీర్ణంలో గుంత తీశారు, నీటి నిల్వ సామర్థ్యం ఎంత? వంటి విషయాలను స్థానిక సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నీటి కుంట వద్ద చేపట్టాల్సిన మరిన్ని మార్పులను ఉపాధి కూలీలకు ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సూచించారు. కుంటకు నాలుగు పక్కల కట్టలు మొత్తం సెక్షనింగ్ చేసి శుభ్రం చేయాలని ఆదేశించారు. మండలంలో ఇంకా సేద్యపు నీటి కుంటలతో పాటు పండ్ల తోటలు ఎక్కువగా గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కన్సల్టెంట్‌లు గౌరీ శంకర్, శ్రీధర్, డ్వామా మేనేజ్‌మెంట్ అండ్ ఎవల్యూషన్ అధికారి పావులూరి బాలమ్మ, జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఈసి రాజా పాల్గొన్నారు.

భూహక్కు చట్టంపై కూటమి నేతల దుష్ప్రచారం

తెనాలి: భూహక్కు చట్టం(ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్)పై టీడీపీ, జనసేన పార్టీలు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నాయని వైఎస్సార్ సీపీ లీగల్‌సెల్ న్యాయవాదులు ఆరోపించారు. చట్టం ఇంకా అమలులోకి రాకముందే ప్రభుత్వ పరిశీలనలో ఉండగానే ప్రజలను మభ్యపెట్టి ఎన్నికల్లో లబ్ధిపొందాలనే దురుద్దేశంతోనే విషప్రచారం చేస్తున్నాయని చెప్పారు. స్థానిక గంగానమ్మపేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్, పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి గుంటూరు కృష్ణ, పట్టణ అధ్యక్షుడు కేఎం విల్సన్ మాట్లాడారు. కేంద్రప్రభుత్వం నీతి అయోగ్ ద్వారా ప్రవేశపెట్టిన భూ హక్కు చట్టం ఇంకా రాష్ట్రంలో అమలులోకి రాలేదన్నారు. ఓడిపోతామనే ఆందోళనతో కూటమి నేతలు చేస్తున్న దుష్ప్రచారాన్ని రైతులు నమ్మవద్దని కేఎం విల్సన్ సూచించారు. ఎవరెంతగా విషప్రచారం చేసినా ప్రజలు మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని గెలిపిస్తారని స్పష్టంచేశారు. మాజీ ఏపీపీ గువ్వల పద్మావతి, మాజీ ఏజీపీ తాడిబోయిన బుచ్చిరాజు, లీగల్‌సెల్ న్యాయవాదులు గుమ్మడి రవిరాజ్, షేక్ ఖాదర్ హుస్సేన్, తాడిబోయిన నాగార్జున, పిల్లి ప్రేమరాజ్, టి.సాంబశివరావు పాల్గొన్నారు.